# కవిగారూ - కుర్రాళ్ళూ

ఆ రోజు .... కవిగారు కందిపచ్చడీ, చారు నీళ్ళతో సుష్టుగా భోంచేసి లేచి, ఒక్కగానొక్క పడక కుర్చీ నాక్రమించుకుని, డబ్బా బోర్లించగా దొరికిన వక్కపలుకులు నోట్లో దాచుకుని, మత్తుగా కళ్ళు మూసుకుని హాయిగా ఊహా జగత్తుకి సాగిపోయారు.

ఆయన గొప్ప కవులు, గొప్ప సంఘ సంస్కర్తలు, గొప్ప మానవసేవాభిలాషులు, గొప్ప.... గొప్ప ....! ఈ పొగడ్తలన్నీటితోనూ ఆయన చిరునవ్వులతో ఏకీభవిస్తారు.

కలంపట్టి కావ్యజగత్తులో కురకాలనే కోరిక ఆయనకు హఠాత్తుగా ముప్పై నాలుగోయేట పుట్టుకొచ్చింది. అచంచలమైన ఆత్మ విశ్వాసంతో వెనువెంటనే కార్యసాధన కుపక్రమించారు. పద్యాలతో ప్రారంభించి, గేయాలలోకి దిగి, నవలలు రాసి, నాటకాలు సృష్టించి, కథలు అల్లి, బాలశీర్షికలు నిర్వహించి, అవిరామంగా శ్రమించి, సాహితీ ప్రక్రియలన్నిటా చేయి తిరిగిన దిట్ట అనిపించుకున్నారు.

ఆయన రచనలనిండా ప్రేమ, విరహం, శృంగారం, అభ్యుదయం, ఆదర్శం, సంస్కారం; దేశభక్తీ, త్యాగనిరతీ, జాతీయతా — ఇవన్నీ కలిసిపోయి వుంటాయి. ఆయన ఊటకలం నవరసాలూ పోసుకుని పూటకో రకంగా చిందులేస్తూ వుంటుంది.

ఆయనకు కూడా అమితాశ్చర్యం కల్గించే విషయం ఏమిటంటే, కలం పట్టిన ఐదారు సంవత్సరాలలోనే పన్నెండు వేల ఠావుల సాహిత్యం సృష్టించగల్గటం! ఎంత వింత! ఈ వింతలో ఎక్కువ భాగం, చాలా గొప్ప అద్భుత ఘట్టాలతో నిండి వున్న సాహిత్యం, వారి బట్టల పెట్టెలోనే వుంది. ఉన్న నాలుగు గుడ్డలూ ఏ దండెం మీదనో అట్టే పెట్టుకోవచ్చునని, ఆ పాత కావిడిపెట్టిని కేవలం సాహిత్యానికే కేటాయించా రాయన. ఆ పెట్టెడు రచనలూ రుచి చూసి, కడుపునిండా ఆనందించే భాగ్యం, కవిగారి అర్ధాంగి పిచ్చమ్మగారికి మాత్రమే దక్కుతుంది.

వచ్చిన చిక్కేవిటంటే, కవిగారు కొత్త నవలో, నాటకమో, పూర్తి చెయ్యబోతోంటే పిచ్చమ్మగారు హఠాత్తుగా పుట్టింటి ప్రయాణం పెట్టేసుకుంటుంది. ఆవిణ్ణి వారించటం ఎవరి తరం? కవి అవనీ! ఆయన తాత అవనీ!

వారం రోజుల్లో వస్తానని వెళ్ళినావిడ, వారానికి వారం జత చేసి గడువులు పొడిగిస్తూ వుంటుంది. కవిగారు కొత్త నవల పట్టుకుని అత్తవారింటికీ బయల్దేరి వస్తున్నారని తెలిసిన పూట మాత్రం ఆవిడ వెళ్ళినంత హడావిడిగానూ వెనక్కి తిరుగుతుంది. ఆ బాటసారు లిద్దరూ ఏ బెజవాడ స్టేషన్‌లోనో ఎదురుబొదురు బళ్ళలో కలుసుకుని వెనక్కో ముందుకో పోవటం కద్దు.

ఇంటి కొచ్చిన తర్వాత ఆవిడకో బ్రహ్మాండమైన సౌకర్యం జరుగుతుంది. వారం రోజులవరకూ, పాడువంట (ఇది ఆవిడమాటే) చెయ్యక్కర్లేదు. ఇక్కడ పుల్ల తీసి అక్కడ పెట్టక్కర్లేదు. కాలు కదపక్కర్లేదు. పడక్కుర్చీకూడా ఆవిడదే, చెయ్యాల్సిందల్లా కవిగారు కొత్త రచన చదువుతోంటే ఊఁ కొట్టటం! కానీ, అదే ఆవిడకెందుకో గిట్టదు. పిచ్చమ్మగారికి పతి భక్తి లేదేమోనని ఎవరైనా శంకిస్తే వాళ్ళు బొందితో నరకానికి పోతారు. పాతివ్రత్యమంటే ఆవిడకు మహా ఇది. ఆ ఇదితోనే ఆవిడ తన ఇష్టాయిష్టాల్ని త్యాగంచేసి, కవిగారు రాసినవన్నీ ఎప్పుడో అప్పుడు విని ఆనందించటానికి శక్తికొద్దీ ప్రయత్నిస్తుంది. కోర్టుల్లో విడాకుల చట్టమంటూ ఒకటి వెలిసిందని చెప్తే, ఆవిడ మరో పది జన్మలెత్తినా నమ్మదు.

## కథకొద్దాం!

పిచ్చమ్మగారు వంటిల్లు సర్దుకుని వరండాలో కొచ్చింది. దండెం మీద వేళ్ళాడుతోన్న పాత గుడ్డలేవో లాగి ముందేసుకు కూర్చుంది. "ఈసారి జీతాలు రాగానే నేను రెండు కట్టుడు చీరలు కొనుక్కోవాలి! వొంటి మీద గుడ్డలన్నీ చిరుగు పట్టేశాయి" అంది దేవుణ్ణుద్దేశించి.

కవిగారు మాట్లాడలేదు. అసలు విన్నట్టులేదు. ఆయన కేదో అద్భుతమైన ప్రేరణ దొరికింది. కవిగారి కన్నుల ముందు ఒకానొక స్వప్న సుందరి సిగ్గు దొంతరల మధ్య సాక్షాత్కరించింది. పద్య పాదాలకోసం ఆయన తల కిందికీ మీదికీ ఝూడించటం మొదలుపెట్టారు. చివరికి మాటలు కలిపి, ప్రాసలు జోడించి, జలతారంచు పట్టు పీతాంబరాలతో స్వప్న సుందరి మేనంతా సింగారించారు. గాలితో సయ్యాటలాడే ధవళవర్ణపు సిల్కు వల్లెవాటు కూడా వేసి ఇంకా కొంత తృప్తి పడ్డారు.

పిచ్చమ్మగారు వెర్రెత్తిన దానిలా కుట్టే కుట్టే పాతగుడ్డలక్కడ పారేసి లోపలికి పోయి, పళ్ళూడిన కొమ్ముదువ్వెన వెతికి తెచ్చుకుని జుట్టు ముడి వూడదీసి కీటకాల వేటకుపక్రమించింది.

"పిల్ల వెధవలు బళ్ళల్లోకి పోతారు. బుర్రలనిండా ఎక్కించుకొస్తారు. నా దగ్గిర పడుకోకండర్రా అంటే వింటారా, పెడతారా? కంపరం పుడుతోంది, పాడు పేలు. మంచి దువ్వెన తెచ్చుకోవాలి ఈసారి బజారు కెళ్ళినప్పుడు" అంటూనే ఆవిడ బరబరా చెంపలు దువ్వి మహోత్సాహంతో జీవహింస సాగించింది.

కవిగారు ఈసారి సీసపద్యం ప్రారంభించారు.

స్వప్నసుందరిని చేరబిలిచి, గండు తుమ్మెదల దండువంటి ఆమె జుత్తు నొక్కులు సవరించి, ఘుమఘుమలాడే సంపెంగ నూనెరాసి, మీగడ తరకవంటి దంతపు దువ్వెనతో దువ్వి, చంద్రవంక శిఖ చుట్టి, నిండుగా సన్నజాజుల చెండు తురిమి, మేలిముసుగు సర్ది, మహదానందం పొందారు.

"ఎంత జుట్టు! ఎంత జుట్టు! ముక్కాలి పీటమీద కూచుంటేగానీ దువ్వుకోడం కుదిరేదికాదు. బెత్తెడు వెడల్పున బారెడు .... బారెడేం? అంత జడ వచ్చేది. మీరెరగనిదా ఏమిటి? పెద్దవాడి పుట్టుకతో ప్రారంభమైంది, ఊక రాలినట్టు రాలడం. మంత్రం పెట్టినట్టు మాయమైపోయింది. ఏమిటో వెర్రి! ఇవ్వాళ్ళ ఇంట్లో, రేపు మంట్లో! జుట్టు దేమొచ్చె!" హఠాత్తుగా ఆవిడకా క్షణంలో పుట్టెడు వైరాగ్యం ముంచుకొచ్చింది. "అందచందాలు ఇంతేనా?" అని దిగులు పుట్టింది. దీనంగా పతిదేవుణ్ణి చూసింది.

ఆయన తన స్వప్న సుందరి పాదపద్మాలకు చిరుగజ్జెలు కట్టి ఆమెని నెమలిలా ఆడిస్తూ, కోయిలలా పాడిస్తూ, తన్మయులౌతున్నారు.

వారి కవితారాధన పరిసరాల్లో పిచ్చమ్మ గారి దీనాలాపం అరణ్యరోదనం అయింది.

"పిచ్చిదానా! ఎందుకా దిగులు? నువ్వెప్పుడూ నాకు రంభలాగే కనిపిస్తావు" అనకపోయినా, ఏదో ఓదార్పుగా ఒక చల్లటి మాట అనకపోతారా అని పిచ్చెమ్మగా రాశపడింది — "వచ్చే కాలవాఁ, పోయే కాలవాఁ? పదిమందితో పాటే పిచ్చెమ్మానూ" అంటూ స్వగతం చెప్పుకుని తృప్తిపడి జుట్టు ముడేసుకుంటూ లేవబోయిందావిడ.

హఠాత్తుగా కవిగారు సాదా లోకంలో కొచ్చిపడ్డారు. 'కూచో, కూచో! లేవకు, లేవకు! కందాలు నాలుగూ, సీసం ఒకటీ రాశాను" అంటూ కాయితాలు ఎత్తిపట్టి, కంఠం సవరించుకుని కవితాగానాని కుపక్రమించేంతలో ............

ఎవరో ఇద్దరు పెద్ద కుర్రాళ్ళు — పొడుగు లాగూల వాళ్ళు, పొట్టి చొక్కాల వాళ్ళు, అందమైన మొఖాల వాళ్ళు, వినయమైన చూపుల వాళ్ళు, పదునారేళ్ళ వయస్సుల వాళ్ళు, రామలక్ష్మణుల ఛాయల వాళ్ళు, అలాంటి వాళ్ళు ముకుళిత హస్తాలతో మెట్లమీద సాక్షాత్కరించారు. పిచ్చమ్మ గారు పిచ్చుకలా గంతులేసి, లోపలికెళ్ళిపడింది.

కుర్రాళ్ళు వచ్చింది కవిగారి దర్శనార్థం.

కవిగారు, క్షణక్షణానికీ నెమరు వేసుకుంటూ జన్మజన్మలకూ జ్ఞప్తి ఉంచుకోగలిగే మధుర ఘట్టాలు అలాంటివే.

కుర్రాళ్ళు కవిగార్ని భక్తి భావంతో నిలువెల్లా పరికించారు. ఈయన ... ఈయనేనా? నవలలు ... నాటకాలు ... పద్యాలు ... గేయాలు ... కథలు ... కావ్యాలు ... ఈయనేనా? కవిగారి బక్కచిక్కిన శరీరంగానీ, చిరుగుపట్టిన బనీనుగానీ, దండెం మీద వేళ్ళాడుతోన్న పాత పీలికలుగాని, ఇంటి కప్పులో మెరుస్తోన్న కన్నాలుగానీ, కూర్చోటానికి లేని కుర్చీలు గానీ — ఏవీ వాళ్ళ ఆలోచనలకు అందలేదు.

కవిగారు! కవిగారు! కవిగారు నించున్న ఆ గది వెన్నెల మడుగులా వుంది! కవిగారి పక్కన పడక్కుర్చీ

రాయంచలా వుంది. కవిగారు సాక్షాత్తూ దేవుళ్ళా ఉన్నారు. కుర్రాళ్ళిద్దరూ సంతోషంతో తన్మయత్వం చెందారు. ఇద్దరూ పోటీలుపడి కవిగారితో చెప్పు కున్నారు.

"మీరంటే... మాకు... ఎంతో భక్తి!"

"భక్తి అంటే చాలదు. ఎంతో ఆరాధన!"

"మీరు పత్రికల్లో రాసినవన్నీ చదవ లేదుగానీ... దొరికినవన్నీ చదివాం."

"మేమిద్దరం వాటినిగురించి తర్కించుకుంటాం."

"మిమ్మల్ని చూడాలని, చాలా రోజుల నుంచీ అనుకుంటున్నాం."

"అదృష్టవశాత్తూ ఇవ్వాల్టికయింది."

కుర్రాళ్ళిద్దరూ ఆగారు.

కవిగారు మైమరపుతో తల పంకిస్తున్నారు.

"మీరీమధ్య కొత్తవేమన్నా రాస్తే... మాకు చెప్తే..."

"రాయకేం? ... కూర్చోండి, కూర్చోండి ... ముందు కూర్చోండి నాయనా! ఇదిగో, ఇప్పుడే చదివి వినిపిస్తాను. ఇవ్వాళ రాసిన నాలుగు పద్యాలూ ముందు వినిపిస్తాను."

పాతకాయితాలేవో వెనక్కి గెంటి గోడ దగ్గిర బల్లమీద కుర్రాళ్ళు కూర్చునేటంత ఖాళీ చేశారాయన.

కుర్రాళ్ళకి ఇంద్రజాలంలా వుంది.

అసలు కవిగారు కన్పించరేమో అనుకున్నారు. కన్పించినా మాట్లాడరేమో అనుకున్నారు. మాట్లాడినా, ఏమో, ఏమంటారో అనుకున్నారు. అలాంటి కవిగారు వారే స్వయంగా కనిపించి, స్వయంగా మాట్లాడి, వారు రాసింది కూడా స్వంత కంఠంతో చదివి వినిపిస్తానంటే, నమ్మలేనంత అబద్ధంలా వుంది!

కవిగారు రాగయుక్తంగా చదువుతూ, మధ్య మధ్య శ్లేషల చమత్కారం విప్పి చెప్పటంతో ఆ నాలుగు పద్యాలూ అర గంటకు ముగిశాయి.

కుర్రాళ్ళు పసివాళ్ళలాగ విన్నారు. ఆనందించారు. కళ్ళ చూపుల గుసగుసలతో మాట్లాడుకున్నారు.

"కవిగారీ పద్యాలు రాయటానికి ఇన్‌స్పిరేషన్ ఎవరంటావ్?"

"ఇంకెవరు? వారి భార్యే..."

"ఆవిణ్ణి కూడా చూస్తే?"

"నిజమే. చూస్తే?"

"ఏవిటి నాయనా? మీ సందేహమేమిటి?" ఆ సందేహాలు తీర్చాలని కవిగారి కుతూహలం.

కుర్రాళ్ళిద్దరూ చూపులు కలుపుకు న్నారు. ధైర్యం తెచ్చుకున్నారు — "మాకోసారి అక్కయ్యగార్ని కూడా చూడాలని ఉందండీ!"

పిచ్చమ్మగారు కూడా విందా మాటలు. ఆవిడ తలుపు వెనక నుంచి కుర్రాళ్ళని చూస్తోనే వుంది. 'ఆ ఎర్రటి కుర్రాడే కులమో? పెద్ద పిల్ల పెళ్ళి కెదుగు తోంది. దానా దీనా ఆ ముక్క ఎత్తినా బాగుణ్ణీయన. ఏవీ పట్టించుకోరు. మాలోకం మనిషి. పిలిచి చెప్పు దునా?" అని సంశయిస్తోందావిడ.

"అక్కయ్యగార్ని చూపించరా?" — కుర్రాళ్ళు.

"అదెంత భాగ్యం నాయనా! పిలుస్తా నుండండి" తలతిప్పి లోపలి గుమ్మం వేపు మొహంపెట్టి — "ఏమేఁ" అని గావుకేక పెట్టారాయన.

బిక్కచచ్చి పోయారు కుర్రాళ్ళిద్దరూ.

అంతలో పిచ్చమ్మగారు దోబూచులాడే దానిలా గుమ్మంలోకి తొంగి చూసింది.

వెర్రిమొహాలేసి తెల్లబోయారు కుర్రాళ్ళిద్దరూ! వెలిసిపోయిన పాత చీర — మట్టి గాజులు— మెళ్ళో తాడుముక్క — నిమ్మ కాయంత ముడి — పీక్కు పోయిన మొహం! ఈవిడా? ఈవిడేనా కవిగారి భార్య? ఏవీ ఆ జలతారంచు పట్టు పీతాంబరాలు? ఏవీ ఆ గండు తుమ్మెదల దండు కేశపాశాలూ? ఆ తళుకుల చెంపలు, ఆ అందాల చిందులు, ఆ కలకలలు, ఆ మిలమిలలు...? కాదు, ఈవిడ కవితా సుందరికి ఇన్‌స్పిరేషన్ ఎలా అవుతుంది? మరి ఆ పద్యాలంత బాగున్నాయేం?

కుర్రాళ్ళు వాళ్ళ లోకంలో వాళ్ళున్నారని సందు చూసి పిచ్చమ్మగారు మొగుడికి సైగ చేసి కొంచెం కంఠం తగ్గించి కడుపులో మాటకాస్తా అనేసింది. "ఆ ఎర్రటి కుర్రాడే కులమో కనుక్కోండి. ఎందుకేనా మంచిది. మర్చిపోకండి" — ఆ రెండు ముక్కలూ చెప్పేసి గడపదాటి అదృశ్యమై పోయిందావిడ.

కుర్రాళ్ళిద్దరూ కూడబలుక్కోకుండానే ఎవరికి వాళ్ళే కర్రల్లా లేచి నించున్నారు — 'వెళ్తామండీ.'

"అదేవిటి? అప్పుడే! మంచిమాటే! కూచోండోయ్! కొత్త రచనలు చదివి వినిపిస్తాను. ఒసే! ఆ పెట్టిలా పడెయ్" కంగారుగా మళ్ళీ కేక పెట్టారు కవిగారు!

అప్పటికే కుర్రాళ్ళు వీధి గుమ్మంలో ఉన్నారు.

"వెళ్ళిపోవాలండీ! చాలా అర్జంటు!" మెట్లు దూకేశారు.

"పోనీ మళ్ళీ రేపురండి!" కవిగారి ఆహ్వానం దీనంగా.

కుర్రాళ్ళెలా మాయమయ్యారో కనపళ్ళేదు.

కుర్రాళ్ళిద్దరూ ఆశ్చర్యాలు వెలిబుచ్చుకోడానికి రోడ్డు మధ్య ఆగిపోయారు.

"కవిగారు కూడా భార్యని అలా పిల్చారేవిట్రా? 'ఒసే'నా! 'ఏమే'నా! మరి పద్యాల్లో, 'సుందరీ, ప్రేయసీ' అని పిల్చినట్టు రాస్తా రుగా?"

"పద్యాల్రా అవీ! నిజంలో అలా పిలవరుగా? కవిగార్లైనా ఇంట్లో అంతేనన్న మాట!"

"సుందరి మీద కవిగారు అంత అందంగా పద్యాలు రాస్తారు గదా? అక్కయ్యగారు అలా వున్నారేవిట్రా?"

"పాపం కవిగారు పేదవారు రా! దానికి ఆయనేం చేస్తారు?"

"అవుననుకో. మరి... పేదతనంగా బతుకుతున్నారు కదా? పేదతనం మీదే, కష్టాలమీదే పద్యాలు రాయకూడదూ? అలాగే రాయాల్రా! స్వర్గాలూ, దేవలోకాలూ, అప్సరసలూ, అమృతాలూ... అలాంటివి ఎందుకురా? అవన్నీ ఎక్కడు న్నాయి?"

"కాయితాల మీదే! కవిగారి ఇంట్లో లేవు. కవిగారి జీవితంలో లేవు."

"అయ్యయ్యో! 'ఇలాంటివి ఎందుకు రాస్తున్నారు కవిగారూ' అని మనం అడగవలసిందిరా!"

"అసలు భార్యని 'ఒసే' అని ఎందుకు పిల్చారో, ఆ ఒక్కమాటన్నా అడగవల్సిందిరా!"

"అయితే, రేపు మళ్ళీ వెళ్దాం."

"నా కేవిటో గాభరాగా ఉందిరా! ఏదైనా సినిమాకి పోదాం! కాస్సేపు సరదాగా వుంటుంది."

"నా కెందుకో తల తిప్పుతోంది, విఠలాచార్య పిక్చర్కే పోదాం!"

సోడాలు తాగి, తీరిగ్గా సినిమాహాల్లో కూచున్నాక, కుర్రాళ్ళ మొహాల మీదకి కొంచెం కళ వచ్చింది.

ఉన్నట్టుండి ఇద్దరూ హఠాత్తుగా ఒకరితో ఒకరనుకున్నారు — "హోరినీ! కవిగారూ మామ్మూలు వాళ్ళేరా! అందర్లాంటి వాళ్ళేరా!"

[''ప్రగతి'' వారపత్రికలో. 1970 కన్నా ముందు కావచ్చు] ★

# కమల

కమల మొదటిసారి అత్తగారింటికొచ్చి అప్పటికి పదిరోజులైంది. ఆ పదిరోజులూ ఇక్కడ పుల్లతీసి అక్కడ పెట్టవలసిన పని లేకుండా అంతా అత్తగారే చేసుకుపోతోంది.

కొత్త కోడలికి రోజంతా విశ్రాంతే. రెండు పూటలా కొత్తచీరలూ, ముస్తాబులూ, అత్తగారందించే టిఫెన్లు తినడం, పత్రికలు చదువుకోడం, అలా జరిగిపోయింది.

ఆ పూట కమలకి కళ్ళు చెమర్చినంత బాధ కలిగింది. ఎన్నడూ ఒక్కమాట అనని అత్తగారు కోపంగా మాట్లాడింది.

అన్నదంటే అనదా? తప్పంతా తనదే! మరీ బుద్ధిలేకండా చేసింది.

మధ్యాన్నం ఆడ బిడ్డ స్కూలునించి వచ్చి తల్లి కోసం వెతుక్కుంది. ఆవిడ నిద్రపోతోంటే, ఆ పిల్ల కమల దగ్గిరికి వచ్చి "వదినా! అన్నం పెడతావా?" అంది.

వార పత్రికలో మునిగిపోయిన కమల కొంచెం తలతిప్పి చూసి "మీ అమ్మ పెడుతుందిగా?" అంది.

"అమ్మ నిద్రపోతోంది."

"వస్తాలే, కాస్సేపు ఆగు."

"మళ్ళీ బడికి వెళ్ళాలి వదినా తొందరగా."

"నువ్వే పెట్టుకోరాదూ, అన్నీ అక్కడే వుంటాయిగా? అన్నం కూడా పెట్టుకో లేవా?"

ఆ అమ్మాయి మాట్లాడకుండా వెళ్ళిపోయింది. తనే పెట్టుకుంటుందేమో అనుకుంది కమల.